సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 2 । ఆగస్టు । 2023





**రూ.కోటి 'గోవింద'..!**
లబ్ధిదారుల పింఛన్, పొదుపు డబ్బులను జీపీఎం కాజేసిన ఘటన కొప్పోలు గ్రామంలో వెలుగులోకి వచ్చింది.
- 8లో



**మెనూ పాటించాలి**
మెనూ ప్రకారం భోజనం అందించాలని జీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ మల్లయ్య బట్టు అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
30°/25°

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 10 మంది తహసీల్దార్ల బదిలీ

భువనగిరిటౌన్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల్లో అధికారుల బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల అధికారి నవీన్ మిట్టల్ పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. జిల్లాకు 11 మంది తహసీల్దార్లను బదిలీ చేయగా.. ఇక్కడి నుంచి 10 మందిని ఆయా జిల్లాలకు బదిలీ చేశారు.

**జిల్లాకు వచ్చిన వారు**
నల్లగొండ జిల్లా నుంచి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్, కిరణ్‌మాల్, లాల్‌బాహదూర్, జి.దేశ్యా, సూర్యాపేట జిల్లా నుంచి శేషగిరిరావు, రాంప్రసాద్, నాగర్‌కర్నూల్ నుంచి కృష్ణ, ఎస్.అంజిరెడ్డి, క్రిష్టయ్య, శ్రీనివాస్‌రావు, వనపర్తి జిల్లా నుంచి శాంతిలాల్‌లు యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చారు.

**బదిలీ అయిన వారు**
జిల్లాలో పనిచేస్తున్న అశోక్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాకు, జయమ్మ, పద్మసుందరి హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. దశరథ, జ్యోతి నల్లగొండ జిల్లాకు, గణేష్ వికారాబాద్‌కు, జ్యోతి, షేక్ అహ్మద్, బ్రహ్మయ్య, శ్యాంసుందర్‌రెడ్డి సూర్యాపేట జిల్లాకు బదిలీ చేశారు.

### శ్రీలక్ష్మీనారసింహుడికి సంప్రదాయ పూజలు



హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు.

### యాదాద్రీశుడిని దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి లడ్డూప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదం అందజేశారు.

### పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరిటౌన్: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న టీయూఎఫ్‌ఐడీసీ పనులకు సంబంధించి డ్రెయినేజీలు, రోడ్లు, సుందరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వైకుంఠధామాలు, సమీకృత వెజ్, నాన్‌వెజ్ భవన నిర్మాణాలు, మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, పట్టణ ప్రకృతి వనాలు, నర్సరీల నిర్వహణ, హరితహారంలో మున్సిపాలిటీల లక్ష్యాన్ని నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో ఎలుకలు!

**జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు దడ పుట్టిస్తున్న ఎలుకలు**
- మార్చురీలో సౌకర్యాలు లేకపోవడంతో మృతదేహాలను కొరికేస్తున్న వైనం
- ఎలుకల నివారణకు చర్యలు చేపట్టని వైద్యాధికారులు



భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మార్చురీ గది

సాక్షి, యాదాద్రి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎలుకలు సంచరిస్తున్నాయి. ఆస్పత్రి ఆవరణతోపాటు, అన్ని విభాగాల్లో తిరుగుతూ రోగులకు దడ పుట్టిస్తున్నాయి. మార్చురీలో మృతదేహాలనూ వదలడం లేదు. పెరికల రవికుమార్ అనే వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచగా ముఖం, చెంపలు, నుదుటిపై ఎలుకలు కొరికిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకులు, బంధువులు వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అసౌకర్యాల పట్ల వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలోనూ ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా ఎలుకల నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

**అధ్వానంగా మార్చురీ..**
భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీ గది అధ్వానంగా తయారైంది. ఫ్రీజర్ సరిగా పనిచేయకపోవడంతో మార్చురీలో ఎక్కడపడితే అక్కడ మృతదేహాలను పోస్టుమార్టం కోసం వదిలివెళ్తున్నారు. దీంతో వీటిని ఎలుకలు కొరికేస్తున్నాయి. జూలై 31న జరిగిన సంఘటన చూస్తే భువనగిరి ఆస్పత్రి మార్చురీపై పర్యవేక్షణ ఏమాత్రం లేదని స్పష్టమవుతోంది. కిటికీలు, డోర్లు, నిర్వహణ బాధ్యతలు సక్రమంగా లేకపోవడం వల్లే ఎలుకలు, పందికొక్కులు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సుమారు 8 ఫ్రీజర్లు ఏర్పాట్లు చేయాలి. కానీ ఒక్క ఫ్రీజర్ మాత్రమే ఉండడం ప్రభుత్వ ఆస్పత్రిలో వసతుల లేమికి అద్దం పడుతోంది.

**నెలలో 30 వరకు మృతదేహాలు..**



మార్చురీ ఆవరణలో చెత్తాచెదారం

జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే ట్రాక్‌ల వెంట నిత్యం జరిగే ప్రమాద ఘటనల్లో మృతదేహాలను పోస్టుమార్టం కోసం భువనగిరి ఆస్పత్రికి తీసుకువస్తారు. సగటున నెలకు 30 వరకు మృతదేహాలు వస్తాయి. ఒక్కో రోజు నాలుగైదు మృతదేహాలు కూడా వస్తాయి. ఇక్కడ వీటిని భద్రపరిచేందుకు గది మాత్రం అనుకూలంగా లేదు. రెండు మృతదేహాలను భద్రపరిచే అవకాశం ఉన్న ఫ్రీజర్ గదిలో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్నాయి. ఫ్రీజర్ ఉండే గదిలోకి బయట వెలుతురు రాకుండా జాగ్రత్తలు ఉండాలి. గదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉండకూడదు. మార్చురీ ఆవరణలో ఇసుక, కంకరతో ఫ్లోరింగ్ చేసి ఉంటే బయటి నుంచి ఎలుకలు రావు. అలా కాకుండా మట్టిపై బండలు వేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని పలువురు చెబుతున్నారు. కాగా.. ఈ సంఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్ రావు విచారణ జరిపారు.

**నిర్లక్ష్యానికి నిదర్శనం**



భువనగిరి ఏరియా ఆస్పత్రిలో మృతదేహాన్ని ఎలుకలు కొరికిన సంఘటన పూర్తిగా వైద్య ఆరోగ్యం శాఖ, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. గుర్తు తెలియని మృతదేహాలను నాలుగు రోజులపాటు ఉంచితే ఆ మృతదేహాన్ని గుర్తుపట్టి తీసుకెళ్లే లోపు పూర్తిగా ఎలుకలు కొరికే ఆస్కారం ఉంది. భువనగిరి ఏరియాలో సుమారు 4 ఫ్రీజర్లు ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి.
– డాక్టర్ కుడుదుల నగేష్, జెడ్పీ ఫ్లోర్‌లీడర్, యాదాద్రి భువనగిరి

**మెరుగైన వసతుల కోసం చర్యలు**



భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన మార్చురీ గది కోసం ప్రభుత్వం రూ. కోటి 10 లక్షలు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. అదేవిధంగా ఆస్పత్రికి 8 ఫ్రీజర్లు కొత్తగా వస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులు, చుట్టుపక్కల ప్రజలు వేసే వృథా తినుబండారాల వల్ల ఎలుకలు, పందికొక్కులు వస్తున్నాయి. ఆస్పత్రిలో మెరుగైన వసతుల కోసం చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ చిన్నా నాయక్, డీసీహెచ్‌ఎస్

**ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మెమో జారీ**
భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో సోమవారం పెరికల రవికుమార్ అనే మృతుడి ముఖాన్ని ఎలుకలు కొరికివేసిన సంఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్న నాయక్‌తో పాటు మరో ఇద్దరికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ మంగళవారం మెమో జారీ చేశారు. ఈ ఘటనపై నాలుగు రోజుల్లో సమాధానం పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలి



సూర్యాపేటలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీష్ రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : పాలనలో మేటిగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బ్రాహ్మణోత్తముల ఆశీర్వాదాలు ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ధూప దీప నైవేద్యం అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే అన్నం పెట్టే రైతులకు, ఆశీర్వదించే అర్చకులకు ఆదరణ పెరిగిందన్నారు. ఇటువంటి మార్పులను అర్చకులు జన బాహుళ్యంలోకి తీసుకెళ్లాలని సూచించారు. 'జరుగుతున్న అభివృద్ధికి మీరే సాక్షులు.. అందులో కర్త, కర్మ, క్రియ పాత్రలు పోషిస్తున్న ఘనులు మీరే' అని కొనియాడారు. 'నిండు మనస్సుతో మీ ఆశీర్వాదాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎల్లవేళలా ఉండాలి' అని కోరారు. ఎన్నో అవాంతరాలను అధిగమించి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కేసీఆర్ ధూపదీప నైవేద్యం పేరుతో గౌరవ వేతనాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, పోతులపాటి రామలింగేశ్వర శర్మ, శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు శర్మ, నరసయ్య, ఫణి కుమార్ శర్మ, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

# మరోసారి టెట్

- గతేడాది జూన్ 12న నిర్వహణ
- ఈసారి టెట్‌కు 60 వేల మంది
- టీఆర్‌టీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థుల ఎదురుచూపు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 60 వేల మంది అభ్యర్థులు టెట్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. గతేడాది జూన్ 12వ తేదీన నిర్వహించిన టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా, అందులో అర్హత సాధించని వారే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55,003 మంది ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇక ఈఏడాది డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్), బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఎడ్) పూర్తి చేసిన వారి సంఖ్య కలుపుకుంటే దాదాపు 60 వేల మంది అభ్యర్థులు సెప్టెంబరు 15వ తేదీన నిర్వహించబోయే టెట్‌కు హాజరు కానున్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ (ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ సబ్మిషన్) బుధవారం నుంచి ప్రారంభమై ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగనుంది. ఈసారి టెట్‌కు హాజరు కాబోయే వారిలో నల్లగొండ జిల్లా నుంచే పేపరు-1, పేపరు-2కు దాదాపు 31 వేల మంది ఉండనున్నారు. ఇక సూర్యాపేట జిల్లా నుంచి దాదాపు 18 వేల మంది, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి దాదాపు 11 వేల మంది ఈసారి టెట్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో టెట్‌కు అర్హత సాధించని వారే 60 వేల మంది వరకు అభ్యర్థులు ఉండగా ఉండగా, 2011 సంవత్సరం నుంచి నిర్వహించిన టెట్‌లలో అర్హత సాధించిన వారు మరో లక్షన్నర మంది కలిపి ఉపాధ్యాయ నియామకాల నోటిఫికేషన్ ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 2017లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నిర్వహించిన ప్రభుత్వం ఇప్పటి వరకు మళ్లీ టీఆర్‌టీ నోటిఫికేషన్‌ను జారీ చేయలేదు. దీంతో ఈసారైనా నోటిఫికేషన్ వస్తుందేమోనని అనుకున్నా ఇంతవరకు ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం టీఆర్‌టీ నోటిఫికేషన్ జారీ చేసి, టెట్‌తోపాటే నియామక పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

**గతేదాది జూన్ 12వ తేదీన నిర్వహించిన టెట్‌లో అర్హులు, ప్రస్తుత టెట్ కోసం ఎదురుచూస్తున్న వారు...**

| జిల్లా | గత ఏడాది దరఖాస్తులు | అర్హత సాధించిన వారు | ప్రస్తుతం ఎదురుచూస్తున్న వారు |
|---|---|---|---|
| **పేపరు-1** | | | |
| నల్లగొండ | 22,937 | 5,901 | 17,036 |
| సూర్యాపేట | 13,720 | 3,694 | 10,026 |
| యాదాద్రి | 7,378 | 1,811 | 5,567 |
| మొత్తం | 44,035 | 11,406 | 32,629 |
| **పేపరు-2** | | | |
| నల్లగొండ | 20,543 | 8,650 | 11,893 |
| సూర్యాపేట | 12,004 | 5,491 | 6,513 |
| యాదాద్రి | 6,871 | 2,903 | 3,968 |
| మొత్తం | 39,418 | 17,044 | 22,374 |

# కల నెరవేరుతున్న వేళ

- ప్రభుత్వ ఉద్యోగులుగా మారునున్న ఆర్టీసీ సిబ్బంది
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2,465 మందికి లబ్ధి




**ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ సిబ్బంది సంఖ్య**

| డిపోలు | సిబ్బంది |
|---|---|
| దేవరకొండ | 385 |
| నల్లగొండ | 499 |
| నార్కట్‌పల్లి | 72 |
| మిర్యాలగూడ | 380 |
| యాదగిరిగుట్ట | 428 |
| కోదాడ | 278 |
| సూర్యాపేట | 395 |
| మొత్తం | 2437 |

మిర్యాలగూడ టౌన్ : ప్రజా రవాణాలో కీలమైన ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించడంతో ఇక నుంచి ఆర్టీసీ ప్రభుత్వ పరం కానుంది. టీఎస్ ఆర్టీసీకి సరైన ఆదాయం లేక నష్టాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు అలుపెరుగని పోరాటం చేశారు. 54 రోజుల పాటు సమ్మెలోకి వెళ్లారు. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఉద్యమం సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ప్రభుత్వ ఏళ్లనాటి కల నెరవేరుతుండడంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరుస్తున్నాయి. మంగళవారం బస్టాండ్ల వద్ద ఆర్టీసీ సిబ్బంది బాణాసంచా కాల్చి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు.


**ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోలు..**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాదగిరిగుట్ట, నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, నార్కట్‌పల్లి, కోదాడ ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు 2,437 మంది ఉండగా.. కాగా రీజియన్‌లో పలు హోదాల్లో డిపో మేనేజర్లు, అసిస్టెంట్ డిపో మేనేజర్లు, డిప్యూటీ ఆర్‌ఎంలు, సూపర్‌వైజర్లు మరో 28 మంది ఉన్నారు. అంతా కలిపి 2,465 మంది ఉన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయితే వీరంతా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించబడతారు.

**మొదటి జీతం తీసుకుంటేనే లెక్క**



ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం విలీనం చేస్తామనే నిర్ణయం చాలా సంతోషకరంగా ఉంది. కానీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన తరువాత మొదటి జీతం తీసుకుంటేనే లెక్క ఉంటుంది. పదేళ్ల తరువాత ప్రభుత్వం నిర్ణయం మంచిదే.
– గోపనబోయిన శ్రీనివాస్, టీఎంయూ రీజినల్ మాజీ కార్యదర్శి

**ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం**



ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మాకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం.
– చంద్రకళ, ఆర్టీసీ కండక్టర్, మిర్యాలగూడ

## యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

భువనగిరిటౌన్ : మతోన్మాదం ముసుగులో దేశంలో ఉన్న యువతను బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ ఆరోపించారు. మంగళవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన చేగువేరా యంగ్ క్యాడర్ స్టడీసర్కిల్‌లో మోడరేటర్‌గా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువత, ఉపాధి, విద్య, వైద్యం మరిచిపోయి మతం పేరుతో అల్లర్లు సృష్టిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎడ్యుకేషన్ కమిటీ కన్వీనర్ మాటూరి బాలరాజు, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేష్, వనం రాజు, పీఎస్‌ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బోడ భాగ్య, నాయకులు ఉప్పలపల్లి బాలకృష్ణ, రాహుల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేస్తా

- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వినయ్‌కృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

సాక్షి, యాదాద్రి: ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. నూతన కలెక్టర్‌గా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు, బీసీలకు ఆర్థిక సాయం, గృహలక్ష్మి పథకాల అమలును పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నిర్వహించాల్సిన పనులను పక్కాగా అమలు చేయాల్సి ఉందని చెప్పారు. కాగా.. 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి వినయ్‌కృష్ణారెడ్డి మొదటగా జనగామ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కలెక్టర్‌గా విధులను నిర్వహించి, ప్రస్తుతం యాదాద్రి భువనగిరికి వచ్చారు.

**పలువురి అభినందనలు**
కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌కృష్ణారెడ్డికి రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

# కలవరపెడుతున్న కళ్ల కలక

**జిల్లాలో పెరుగుతున్న బాధితులు**
- 231 మంది విద్యార్థులకు ఐ ఫ్లూ
- ఆస్పత్రులకు రోజూ 60 వరకు కేసులు
- వర్షాలకు వేగంగా విస్తరిస్తున్న వైరస్
- జాగ్రత్తలు పాటిస్తే అరికట్టవచ్చంటున్న వైద్యులు



భువనగిరి : జిల్లావాసులను కళ్ల కలక (ఐ ఫ్లూ)కలవరపెడుతోంది. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 231 మందికి ఐ ఫ్లూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. ఆస్పత్రులకూ బాధితులు పెరుగుతున్నారు. జిల్లా కేంద్ర వైద్యశాలకు రోజూ 15 నుంచి 25 మంది వస్తుండగా ఆలేరు, రామన్నపేట, చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 20 నుంచి 35 కేసుల వరకు నమోదవుతున్నాయి. వర్షాకాలం కళ్ల కలక రావడం సాధారణమే అయినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ఈసారి వేగంగా వ్యాప్తి చెందుతుందని, జాగ్రత్తలు పాటిస్తే అరికట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు.


**ఐ ఫ్లూ లక్షణాలు**
బ్యాక్టీరియా, వైరల్, అలర్జిక్ ద్వారా కళ్ల కలక వ్యాప్తి చెందుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలర్జిక్ ద్వారా వ్యాధి స్వల్పంగా వ్యాప్తి చెందే అవకాశం ఉండగా బ్యాక్టీరియాతో 20 శాతం, వైరల్ ద్వారా 80 శాతం వ్యాప్తిస్తుంది. సాధారణంగా అయితే ఆడినో వైరస్ ద్వారా కళ్ల కలక వ్యాప్తి చెందుతుంది. కళ్ల కలక వచ్చిన వారికి కళ్లల్లో నీరు కారడం, ఎరుపెక్కడం, దురద వంటి లక్షణాలుంటాయి. కొన్నిసార్లు కళ్లు ఉబ్బడం, రెప్పలు అతుక్కొని చూడలేని పరిస్థితి ఉంటుంది. ఈ లక్షణాలున్న వారు కొన్నిసార్లు తీవ్రమైన జలుబుకు లోనై కళ్లు ఎర్రబడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కళ్లకు దురద రావడంతో బాధితులు తరచూ చేతులతో రుద్దుతుంటారు. దీని వల్ల సమస్య మరింత పెరుగుతుంది.

**వర్షాకాలంలో వ్యాప్తి ఎక్కువ**
ఐ ఫ్లూ ఎక్కువగా వర్షాకాలంలో వ్యాపిస్తుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో వైరస్ వ్యాపించే అవకాశం, మనగలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**
- బాధితులు కనీసం వారం రోజుల పాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి.
- శుభ్రమైన గుడ్డతో గోరువెచ్చని నీటితో తుడుచుకోవాలి.
- కళ్ల కలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్సి వస్తుంది. అలా తాకిన ప్రతీ సారి చేతులు శుభ్రం చేసుకోవాలి.


**హాస్టళ్లలో మెడికల్ క్యాంపులు**
జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల్లో పెద్ద సంఖ్యలో కళ్ల కలక బారిన పడ్డారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 718 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. 231 మందికి ఐ ఫ్లూ సోకడంతో హాస్టళ్లలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నారు. బాధిత విద్యార్థుల్లో కొందరిని ప్రత్యేకంగా ఉంచుతుండగా మరికొందరిని ఇంటికి పంపుతున్నారు. కాగా.. ఒక్క సంస్థాన్ నారాయణపురం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలోనే 30 మంది విద్యార్థినులు కళ్ల కలక బారిన పడ్డారు. 15మందిని వారి సొంత గ్రామాలకు పంపించారు. మరో 15మందిని ప్రత్యేక గది ఏర్పాటు చేసి, చుక్కల మందు వేస్తున్నారు. సర్వేల్ గురుకుల పాఠశాలలో 50మంది, సర్వేల్ గురుకుల కళాశాలలో 8మందిని వారి సొంత గ్రామాలకు పంపించారు. సంస్థాన్ నారాయణపురంలోని ఆదర్శ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను ఇంటికి పంపించారు.

**ఆందోళన వద్దు**



కళ్ల కలక వచ్చిన వారు ఆందోళన చెందవల్సిన అవసరం లేదు. వైద్యుల సలహాల మేరకు చికిత్స పొందాలి. వారం రోజుల్లో తగ్గుతుంది. కొంత మందికి పక్షం రోజులు పట్టే అవకాశం ఉంటుంది. కలక చేసిన వ్యక్తులు భౌతిక దూరం పాటిస్తే ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉంటుంది. పరిశుభ్రత కూడా ముఖ్యం.
– డాక్టర్ సుమంత్, భువనగిరి

**ఇతరులకు దూరంగా ఉండాలి**



కళ్ల కలక లక్షణాలున్న వారు చికిత్స కోసం రెండు వారాల నుంచి ఆస్పత్రికి వస్తున్నారు. కలక వచ్చిన వారు చేతితో కళ్లను తాకరాదు. ఇతరులకు దూరంగా ఉండాలి. వీరు వాడిన దుస్తులు మరొకరు వినియోగించరాదు. బాక్టీరియా వల్ల వస్తే సమస్య సాధారణంగా ఉంటుంది. వైరల్ ద్వారా వస్తే ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. దీని తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. ఐడ్రాప్స్ వేసుకోవాలి. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. కొందరు వేప పండ్లతో డ్రాప్స్ వేసుకుంటారు. అది మంచిది కాదు. వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.
–స్వప్న, కంటి వైద్యురాలు, జిల్లా కేంద్ర ఆస్పత్రి

## క్లుప్తంగా

### పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్, (తుర్కపల్లి) : పురుగుల మందు తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన తుర్కపల్లి మండలం గందమల్ల గ్రామ పరిధిలోని ఇందిరానగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గందమల్ల గ్రామానికి చెందిన చింతకింది పోచమ్మ (70) భర్త చింతకింది యాదయ్యతో కలిసి జీవనం సాగిస్తోంది. యాదయ్య కొంత కాలంగా అనారోగ్యంతో మంచాన పడ్డాడు. పోచమ్మ రోజు అతడికి సేవలు చేస్తోంది. ఈ క్రమంలో దంపతుల మధ్య మంగళవారం ఉదయం గొడవ జరిగింది. ఒకరినొకరు మాటామాటా అనుకోవడంతో గొడవ తారస్థాయికి చేరుకుంది. దీంతో మనస్తాపానికి గురైన పోచమ్మ ఇంట్లోనే పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు


ప్రమాదానికి గురైన లారీ

రామగిరి(నల్లగొండ): నిర్లక్ష్యంగా లారీని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై తిప్పర్తి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. తెనాలి నుంచి హైదరాబాద్‌కు లారీలో పప్పు ధాన్యాన్ని తరలిస్తున్నారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున సిలార్ మియాగూడెం వద్ద పప్పు ధాన్యంతో వెళ్తున్న లారీ ముందుగా వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పప్పు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ముందు భాగం ధ్వంసం కాగా, క్లీనర్ బేతాల రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. రామిశెట్టి రాజేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ తోట శ్రీహరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపారు.

### కృష్ణమూర్తి జీవితం నేటి తరానికి ఆదర్శం


కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి జీవితం నేటి తరానికి ఆదర్శమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కృష్ణమూర్తి వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి ములకలపల్లి రాములు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్‌ను గడగడలాడించిన గొప్ప పోరాట యోధుడు కృష్ణమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి నరసింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటి ‘గోవింద’..!


కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో ఆందోళన చేస్తున్న ఆసరా పింఛన్ లబ్ధిదారులు


బాధితుడికి తెలియకుండానే ఖాతా నుంచి పొదుపు డబ్బు డ్రా చేసిన పాస్‌బుక్

- లబ్ధిదారుల పింఛన్, పొదుపు డబ్బులు కాజేసిన బీపీఎం గోవింద్‌నాయక్
- పింఛన్ చెల్లించిన తర్వాత మిగిలిన డబ్బులు ఎస్‌పీఎం ఖాతాలో జమచేయకుండా స్వాహా
- ఉన్నతాధికారులకు తెలియడంతో సస్పెన్షన్ వేటు
- ఆందోళనలో బాధితులు.. న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు

కేతేపల్లి: ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పింఛన్ డబ్బులతో పాటు నెలనెలా పోస్టాఫీసులో దాచుకున్న సుమారు కోటి రూపాయలను ఓ బీపీఎం స్వాహా చేశాడు. ఈ భారీ కుంభకోణం కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలంలోని కొప్పోలు గ్రామంలో 461 మంది వివిధ రకాల ఆసరా పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.10.70లక్షలు స్థానిక బీపీఎం గుగులోతు గోవింద్‌నాయక్ స్థానిక పోస్టాఫీసు ద్వారా చెల్లిస్తున్నారు. గత మూడు నెలల నుంచి బీపీఎం గోవింద్ పలువురు పింఛన్ లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ వేలిముద్రలు తీసుకుని డబ్బులు చెల్లించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇలా గ్రామంలోని దాదాపు 150 మంది పింఛన్‌దారుల నుంచి రూ.2000 నుంచి రూ.9000 వేల వరకు స్వాహా చేసినట్లు తెలిసింది. ఈ మొత్తం దాదాపు రూ.27లక్షలు ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

**నెల రోజుల క్రితమే బీపీఎంపై సస్పెన్షన్ వేటు**

లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు చెల్లించిన తర్వాత మిగిలిన నగదును ఎస్‌పీఎం ఖాతాలో జమ చేయలేదనే ఆరోపణలతో బీపీఎంను పోస్టల్‌శాఖ అధికారులు నెల రోజుల క్రితమే సస్పెండ్ చేశారు. ఇక్కడ పింఛన్ల పంపిణీ బాధ్యతను మరో బీపీఎంకు అప్పగించినట్లు తెలిసింది. ఈ కుంభకోణంపై సమాచారం తెలుసుకున్న సంబంధిత అధికారులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. తపాలా కార్యాలయంలో ఉన్న పొదుపు పాస్ బుక్కులను బాధితులకు అందజేశారు. పూర్తిస్థాయిలో మరోమారు విచారణ చేపట్టి బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకుని, ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. కొప్పోలు గ్రామానికి చెందిన పలువురు పెద్ద మనుషులు, రాజకీయ నేతలు అవినీతికి పాల్పడిన బీపీఎం గోవింద్‌కు వత్తాసు పలుకుతున్నట్లు తెలిసింది. విషయం బయటికి పొక్కకుండా గ్రామంలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామంటూ బాధితులను మభ్యపెట్టినట్లు సమాచారం.

**పొదుపు డబ్బులు సైతం..**

ప్రతి నెలా పింఛన్ డబ్బులు తీసుకున్న తర్వాత లబ్ధిదారులు రూ.500 నుంచి రూ.1000 వరకు పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) పేరిట ఖాతా తెరిచి దాచుకునేవారు. ఆ నగదుకు మూడేళ్లు, ఐదేళ్ల కాలపరిమితి అనంతరం లబ్ధిదారులకు వడ్డీ కలిపి మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. బీపీఎం ఖాతాదారుల పొదుపు డబ్బు ప్రతి నెలా సూర్యాపేటలోని పోస్టాఫీసులో జమచేయకుండా స్వాహా చేశాడని ఆరోపణలు ఉన్నాయి. కాలపరిమితి పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు దాచుకున్న మొత్తం డబ్బులు చెల్లిస్తామంటూ బీపీఎం వారి నుంచి సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. ఇలా బీపీఎం గ్రామంలో దాదాపు 400 మందికి చెందిన రూ.78లక్షలు కాజేసినట్లు తెలిసింది. మొత్తం మీద కోటి రూపాయల వరకు బీపీఎం గో విందనాయక్ అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది.

**పూర్తిస్థాయి విచారణ చేపడతాం**

కొప్పోలులో పింఛన్లు, ఆర్‌డీ సొమ్ము స్వాహా అయిన విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామంలో ఇప్పటికే ప్రాథమిక విచారణ చేశాం. నిబంధనల ప్రకారం తపాల సిబ్బంది రూ.5వేలకు పైగా చేతివాటం ప్రదర్శిస్తే కచ్చితంగా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ అంతకంటే ఎక్కువ గోల్‌మాల్ జరిగినందున మొదట స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఈ ఘటనపై ఒక రెండు రోజుల్లో పూర్తిస్థాయి విచారణ చేపడతాం. ప్రతి ఒక్క బాధితుడి నుంచి వాంగ్మూలం తీసుకుంటాము.అవినీతికి పాల్పడినట్లు తేలితే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీపీఎం నుంచి నగదు రికవరీ చేస్తాం. శాఖాపరంగా క్రిమినల్ కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగిస్తాం.

– వెంకటేశ్వర్లు, పోస్టల్ సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్

**రూ.60వేలు కాజేశాడు**



ప్రతి నెలా నా పేరు మీద రూ.500, నా కొడుకు పేరిట రూ.300 పోస్టాఫీసు పొదుపు ఖాతాలో జమ చేశా. ఐదేళ్ల కాల పరిమితి పూర్తయింది. వడ్డీతో కలసి రూ.60 వేలు రావాల్సి ఉంది. బ్యాంకు నుంచి డబ్బులు తీసుకువస్తానని చెప్పిన బీపీఎం కాగితాలపై నా సంతకాలు తీసుకున్నాడు. డబ్బులు డ్రా చేసి సంవత్సరం గడిచినా ఇంత వరకు ఇవ్వలేదు.

– అల్లపురి రఘునాథ, కొప్పోలు

**రూ.34వేలు ఇవ్వాలి**



ప్రతినెలా పోస్టాఫీసు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. మొదటి నెల డబ్బులు ఇంటికి తెచ్చి ఇస్తానని బీపీఎం చెప్పడంతో వేలి ముద్ర వేశా. ఎన్ని సార్లు అడిగినా డబ్బులు ఇవ్వలేదు. రెండో నెల వచ్చే సరికి రెండు నెలల మొత్తం డబ్బులు ఒకేసారి ఇస్తానని చెప్పడంతో నమ్మి మళ్లీ వేలి ముద్ర వేశా. ఇలా రూ.4వేల డబ్బులు కాజేశాడు. దీంతో పాటు పోస్టాఫీసు ఖాతాలో దాచుకున్న రూ.30వేలు నా సంతకాలు తీసుకుని స్వాహా చేశాడు.

– వీరబోయిన రాములు, కొప్పోలు

## అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో చోరీ


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్


దుండగులు నగదు చోరీ చేసింది ఈ లాకర్ నుంచే..

- రూ.8.92లక్షలు అపహరించిన దుండగులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

అనంతగిరి: గుర్తుతెలియని వ్యక్తులు అనంతగిరి మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రాత్రి చోరీకి పాల్పడి రూ.8.92లక్షలు ఎత్తుకెళ్లారు. కళాశాల నిర్వహకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండల కేంద్రంలో ఉన్న అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు డి బ్లాక్‌లో గల కార్యాలయంలోని లాకర్‌లో సోమవారం నగదు పెట్టి తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం కళాశాల సిబ్బంది కార్యాలయం తాళాలు పగలగొట్టి ఉండటంతో లోపలకి వెళ్లి చుసారు. కార్యాలయం లోపల ఉన్న వస్తువులు, లాకర్ కింద పడవేసి ఉండటంతో దొంగతనం జరిగిందని అనుమానించి అనంతగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కిటికీలు పగులగొట్టి.. లాకర్‌ను కట్ చేసి..**

దుండగులు కళాశాలలోని డి బ్లాక్ కార్యాలయ కిటికీలను కట్ చేసి లోనికి ప్రవేశించారు. అనంతరం ఐరన్‌ను కట్ చేసే మిషన్‌తో లాకర్‌ను కట్ చేసి లోపల ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను తీసుకువచ్చి ఆధారాలు సేకరించారు. ఎస్పీ రాజేంద్రప్రసాద్, కోదాడ డీఎస్పీ ప్రకాశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల నిర్వహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

వలిగొండ: మండలంలోని టేకులసోమారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నాలుగు నెలల క్రితం నిర్వహించిన వైద్య శిబిరంలో వార్డు సభ్యుడు దీప పరమేష్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకొన్నారు. ఆయన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో వార్డు సభ్యుడు పరమేష్‌కు అందజేశారు. దీంతో ఆయన ఎస్ఐ ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు.

## మాకు దుకాణాలు కేటాయించాలి


యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల నిరసన

యాదగిరిగుట్ట: యాదాద్రి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రింగ్‌రోడ్డులో తమ ఇండ్లు, దుకాణాలు కోల్పోయామని, తమకు పరిహారం కింద ఇండ్ల స్థలాలు, డబ్బులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దుకాణాలు ఇవ్వలేదని నిర్వాసితులు బొమ్మ నాగేష్, బొమ్మ గుణసాగర్, దొమ్మాట అండాలు, పులిపాటి విజయలక్ష్మీ, గొర్ల నిర్మల ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గండి చెరువు సమీపంలో నిర్మించిన నూతన దుకాణాల సముదాయంలో మడిగెలు కేటాయించాలని కోరుతూ మంగళవారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వామి వారి వైకుంఠద్వారం పక్కనే వరుసగా తమ నివాసాలు, అందులోనే దుకాణాలను ఏర్పాటు చేసుకున్నామని, ఆ దుకాణాలపైనే తమ జీవనం ఆధారపడి ఉండేవని, రోడ్డు విస్తరణలో దుకాణాలు, ఇండ్లు కోల్పోయి రోడ్డున పడ్డామన్నారు. దేవస్థానం అభివృద్ధిలో తాము సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు, దుకాణాలను ప్రభుత్వం తీసుకున్నందుకు అప్పట్లో పరిహారం ఇచ్చినప్పటికీ.. ఇండ్ల స్థలాలు, మడిగెలు ఇవ్వడంతో పాటు పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ ప్రకారం ఇండ్ల స్థలాలు కేటాయించారే కానీ దుకాణం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు నష్టపోయిన నిర్వాసితులకు దుకాణాలు ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వలేదన్నారు. వెంటనే తమకు దుకాణాలు ఇవ్వాలని, అంతే కాకుండా తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## మూతబడిన కంపెనీలో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

- రూ. 90 వేల విలువైన సామగ్రి స్వాధీనం

భువనగిరి : మూతబడిన కంపెనీలో చోరీకి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.90వేల విలువ గల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం నందనం గ్రామ పరిధిలో టైర్లతో ఆయిల్‌ను తయారు చేసే కంపెనీ నాలుగేళ్లుగా మూతపడి ఉంది. ఈ కంపెనీకి రక్షణగా ప్రతి రోజు వాచ్‌మన్ విధులు నిర్వహిస్తాడు. రోజు మాదిరిగా వాచ్‌మన్ సోమవారం ఉదయం కంపెనీ వద్దకు వెళ్లాడు. మోటార్లు, ఇనుప సామగ్రి కనిపించకపోవడంతో కంపెనీ యాజమాని సాయిరెడ్డి విద్యాసాగర్ రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వచ్చి కంపెనీలో మోటార్లు, ఇనుప సామగ్రి చోరీకి గురైనట్లు అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇనుప సామగ్రితో వెళ్తున్న ఆటోను ఆపి అందులో ఉన్న నకిరేకల్‌కు చెందిన వెంకన్న, వలిగొండకు చెందిన లింగయ్య, అశోక్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు విచారణలో నేరం అంగీకరించారు. ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## నూతన పీఆర్సీ ఏర్పాటు చేయాలి


సభ్యత్వాలు అందిస్తున్న సంఘం నాయకులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన వేతన సవరణ కమిటీ (పీఆర్సీ) ఏర్పాటు చేసి తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టీపీయూఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆత్మకూరు మండల శాఖ అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జూలకంటి వెంకట్ రెడ్డి, కోట శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి హరిప్రసాద్, పోతుగంటి శ్రీనివాసాచారి, భాగ్య లక్ష్మి, సరస్వతి, షర్మిల, చంద్రకళ, సునీల్, గురు చరణ్, నీరజ, రంగయ్య, ఫర్హీన్, రజిత, హేమలత, యాదమ్మ, శిరీష, నాగలక్ష్మీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

కోదాడఅర్బన్ : దేశంలో ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 9న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడలో నిర్వహించిన నియోజకవర్గ ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని మండిపడ్డారు. దేశంలో నాలుగు లేబర్ కోడ్‌ల విధానాన్ని రద్దు చేయాలని, రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని ప్రజా పంపిణీ ద్వారా నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు పంపిణీ చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు పెంచి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ముత్యాలు, కాసర్ల శ్రీనివాస్, వక్కవంతుల నర్సింహారావు, ఉదయగిరి, షేక్ లతీఫ్, జీవీరాజు, షేక్ జానీ, నాగరాజు, కుమార్, నయీం తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అధ్యాపక సంఘాల నాయకులు

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని జాయింట్ ఫోరం ఫర్ మూమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (జే.ఎఫ్.ఎం.ఈ) సభ్యుడు ఎంవీ గోనారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆలిండియా విశ్వవిద్యాలయాల కళాశాలల అధ్యాపక సంఘం సమాఖ్య, విశ్రాంత కళాశాలల అధ్యాపక సంఘం సమాఖ్య పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోనారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిపుణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా అశాస్త్రీయమైన విద్యావిధానాన్ని ముందుకు తీసుకొస్తుందని, ఇది భారతదేశ పరిస్థితులకు ఏమాత్రం అనువైనది కాదని అన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ విద్యావిధానాన్ని మార్చి వేస్తూ కేంద్రం ఊహాజనితమైన అంశాలను విద్యార్థుల్లో చొప్పించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. మూఢనమ్మకాలతో కూడిన విద్యావిధానం కేంద్రం తీసుకొస్తుందని దీనిని వ్యతిరేకించాల్సిన బాధ్యత దేశంలోని సకల జనులపై ఉందన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, విద్యారంగ నిపుణులతో చర్చించి ప్రజలకు అనుకూలమైన శాస్త్రీయమైన విద్యావిధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలతో పాటు ప్రముఖ పట్టణాలలో చర్చావేదికలను ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు మందడి నర్సిరెడ్డి, ఆర్.విజయ్‌కుమార్, బండి రాఘవరెడ్డి, అక్కెనపల్లి మీనయ్య, దండా వెంకట్రామ్‌రెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం బాధ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, విద్యావంతులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యం వాహనం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని గుడితండా గ్రామపంచాయతీ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని కల్వకుర్తికి బొలేరోలో తరలిస్తుండగా మంగళవారం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఆంగోతు కుమార్, ఆంగోతు శ్రావణ్‌లు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తిలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి 46 బస్తాలలోని సుమారు పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



## మునగాల ఎస్ఐకి ప్రశంసాపత్రం అందజేత


డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ లోకేష్

మునగాల: మండలంలోని నేలమర్రి గ్రామ పంచాయతీ పరిధిలోని ఐటీసీయల్ సంస్థ పైప్‌లైన్ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించిన ఎస్ఐ లోకేష్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నా యి. పోలీస్ కోఆర్డినేషన్ విభాగంలో డీజీపీ అంజన్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం ఎస్ఐ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పైప్‌లైను ఏర్పాటు విషయంలో సంబంధిత రైతుకు, ఐటీసీయల్ సంస్థ మధ్య జరిగిన వివాదంలో ఎస్ఐ ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని డీజీపీ కితాబిచ్చారు.ఈ సందర్భంగా ఎస్ఐ లోకేష్‌ను పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

మర్రిగూడ: కిడ్నాప్ కేసులో పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం చర్లగూడెం గ్రామానికి చెందిన మాదగోని మహేష్ గత నెల 16న మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. గమనించిన తండ్రి కారును వెంబడించడతో బాలికను వదిలి పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కొన్ని రోజులుగా పరారీలో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి మహేష్‌ను అరెస్ట్ చేశారు. కారుని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## రాగి నాణెంతో మోసగిస్తున్న ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న రాగి నాణెం, నగదు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

- రూ.10 లక్షలకు రాగి నాణెం విక్రయానికి కుదిరిన డీల్
- రూ.6.50 లక్షలు ముట్టజెప్పినా నాణెం ఇవ్వకపోవడంతో పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- కేటుగాళ్లకు మరో రూ.50 వేలు ఇస్తుండగా పట్టుకున్న పోలీసులు

సూర్యాపేట క్రైం : విశిష్ట శక్తులు ఆవహించి ఉన్న రాగి నాణెం ఇళ్లలో ఉంటే.. రూ.కోట్లు సంపాదించడంతో పాటు తమను కత్తులతో పొడిచినా.. తుపాకులతో కాల్చిన తూటాలు దిగవని నమ్మబలికి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరిని సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్‌లోని గొడ్ల సంతలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హుజూర్‌నగర్ పట్టణ కేంద్రానికి చెందిన దండు సౌజన్య, మిర్యాలగూడకు చెందిన షేక్ అజారుద్దీన్‌ను అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. రాగి నాణేనికి కొన్ని విశిష్ట శక్తులు ఆవహించి ఉన్నాయని.. దీని విలువ బయట మార్కెట్‌లో రూ.కోట్లు ఉంటుందని నమ్మబలికి అమాయకులకు విక్రయించి మోసగిస్తున్నారు. సౌజన్య భర్త రామరాజ్ కూడా రాగి నాణెం విక్రయించాలని ప్రయత్నం చేసి మృతిచెందాడు. భర్త చనిపోయిన తర్వాత సౌజన్య ఆర్థిక ఇబ్బందులు తాళలేక తనకు పరిచయం ఉన్న అజారుద్దీన్ సహాయంతో రాగి నాణెం చూపించి సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి రూ.10 లక్షలకు డీల్ కుదుర్చుకుంది. ముందుగా నాణేనికి ఆ వ్యక్తి అడ్వాన్స్‌గా రూ.6.50 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.3.50 లక్షలు ఇస్తే నాణెం ఇవ్వాల్సి ఉంది. కానీ తర్వాత నిందితుల ఫోన్‌లు కొద్దిరోజుల స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయన్నారు. చేసేదేమి లేక బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**మిగిలిన డబ్బులు ఇస్తే నాణేం ఇస్తామని..**

కొద్దిరోజుల తర్వాత తిరిగి నాణెం ఇస్తామని.. మిగిలిన డబ్బులు ఇవ్వాలని చెప్పగా.. బాధితుడు రూ.50 వేలు ఇస్తుండగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి నుంచి రూ.50 వేలు, రాగి నాణెం, కత్తెర ,సూది , దారం స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. కేసును ఛేదించిన ఎస్ఐలు, సిబ్బందిని సీఐ రాజశేఖర్ అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు యాకూబ్, సైదులు, సిబ్బంది గొర్ల కృష్ణ, గోదేషి కరుణాకర్, జోగు సైదులు, మధు, ఆనంద్, బజార్ లు పాల్గొన్నారు.